## పెద్దపులి సంచారం







## వైభవంగా కల్యాణోత్సవం



AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## అవినీతి రహిత కామారెడ్డి కోసం ఇబ్బందులు తప్పవు



**అక్షరటుడే, కామారెడ్డి:** అవినీతి రహిత కామారెడ్డి కోసం చేసే ప్రయత్నంలో కొన్ని ఇబ్బందులు తప్పవని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని రాజిరెడ్డి గార్డెన్‌లో సోమవారం బీజేపీ మద్దతుతో గెలిచిన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామారెడ్డిలో పంచాయతీ ఎన్నికల్లో డబ్బు, మద్యం లేకుండా ప్రజా సేవచేసే ఉద్దేశంతో రాజకీయాల్లోకి వచ్చిన గెలిచిన సర్పంచ్‌లకు శుభాకాంక్షలు తెలియజేశారు.





## నారుమడికి చీరలతో రక్ష

**మోపాల్ మండలం కులాస్‌పూర్ గ్రామ శివారులో నారుపోసిన మడికి చీరలను రక్షణగా చుట్టారు. చీడపీడలు, అడవి పందులు రాకుండా మడికి రక్షణ కల్పించేందుకు రైతులు ఈ ఏర్పాటు చేశారు.**

**–అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్**



## ఎన్నికల కోసం గట్టి బందోబస్తు ఏర్పాటు

**అక్షరటుడే, ముప్కాల్:** పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మూడో విడత పోలింగ్ కోసం గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ముప్కాల్ ఎస్సై కిరణ్‌పాల్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ఈనెల 17న ముప్కాల్ మండల పరిధిలో పోలింగ్ జరుగనున్న దృష్ట్యా ఆయా ప్రాంతాలన్నీ పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకుంటారన్నారు. ఎన్నికల కోడ్ సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి అమల్లోకి వస్తుందన్నారు. ర్యాలీలు, సమావేశాలు నిర్వహించడం నిషేధమని స్పష్టం చేశారు. ఐదుగురికి మించి గుమిగూడకూడదని తెలిపారు. ఈ నియమాలను ఉల్లంఘిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.



## ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్‌గా శ్రావణి

**అక్షరటుడే, ఆర్మూర్ :** ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్‌గా శ్రావణి నియమితులయ్యారు. ఈ మేరకు ఆమె సోమవారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల ఆర్మూర్ కమిషనర్ రాజు ఓ ఇంటి అనుమతి విషయంలో రూ.20వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ విషయం తెలిసిందే. అనంతరం నిజామాబాద్ డిప్యూటీ కమిషనర్ రవిబాబును ఆర్మూర్ మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్‌గా నియమించారు. కాగా.. ప్రభుత్వం శ్రావణిని ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్‌గా నియమించడంతో ఆమె బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు.


## మూడో విడత పోలింగ్‌కు సిబ్బంది కేటాయింపు



**అక్షరటుడే, ఇందూరు:** మూడోవిడత ఎన్నికల విధుల్లో పాల్గొనే పీవో, ఏపీవోలకు ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలను కేటాయించినట్లు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ఎన్నికల పరిశీలకుడు శ్యాంప్రసాద్ లాల్ సమక్షంలో ర్యాండమైజేషన్ నిర్వహించారు. ఏకగ్రీవమైన వాటిని మినహాయిస్తూ, ఎన్నికలు నిర్వహించాల్సిన గ్రామ పంచాయతీలకు సంబంధించి ఒక్కో మండలం వారీగా పీవో, ఏపీవో లను పోలింగ్ కేంద్రాలకు కేటాయించారు. ఈ ప్రక్రియలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, నోడల్ అధికారి పవన్ కుమార్, లీడ్ బ్యాంక్ మేనేజర్ సునీల్, సిబ్బంది పాల్గొన్నారు.

**సర్పంచ్ ఎన్నికల ఘట్టం చివరి అంకానికి చేరింది. ఇప్పటికే రెండు విడతల్లో సర్పంచ్, వార్డు స్థానాల్లో ఎన్నికలు జరగగా.. తుది పోరు బుధవారం జరుగనుంది. అయితే అభ్యర్థుల ఖర్చులపై ప్రస్తుతం జోరుగా చర్చ సాగుతోంది. పరువు కోసం అభ్యర్థులు విచ్చలవిడిగా ఖర్చు చేశారని రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ నడుస్తోంది. గెలిచిన అభ్యర్థి ఐదేళ్లలో చేసిన ఖర్చు ఎలా తీయాలా అని ఆలోచిస్తుంటే.. ఓడిన అభ్యర్థి అప్పులెలా తీర్చాలా అని మదనపడుతున్నట్లుగా తెలుస్తోంది.**

**– అక్షరటుడే, కామారెడ్డి**



# పల్లెపోరు.. తడిసి మోపెడు..

**■ సర్పంచ్ ఎన్నికల ఖర్చు రూ.50 కోట్లు! ■ గ్రామాల్లో విచ్చలవిడిగా నగదు పంపిణీ ■ ఉమ్మడి జిల్లాలో సర్పంచ్ ఖర్చులపై జోరుగా చర్చలు ■ ఖర్చు చేసి ఓడిన అభ్యర్థుల బాధ వర్ణనాతీతం**

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మొదటి రెండు విడతల్లో కలిపి ఇప్పటివరకు 36 మండలాల్లో ఏకగ్రీవాలు మినహాయిస్తే 706 గ్రామ పంచాయతీలలో ఎన్నికలు జరిగాయి. ఈ గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థులు శక్తికి మించి ఖర్చు చేశారన్న టాక్ వినిపిస్తోంది. రూ.లక్షల్లో ఖర్చు చేయడమే కాకుండా మద్యం ఏరులై పారింది. వారం, పదిరోజుల పాటు నిత్యం ప్రజల్లో ఉండాల్సి రావడంతో అభ్యర్థుల ఖర్చు తడిసి మోపెడైందని తెలుస్తోంది.

### ఉమ్మడి జిల్లాలో ఖర్చు..

కామారెడ్డి జిల్లాలో 21 మండలాల్లో 313 గ్రామ పంచాయతీలు, నిజామాబాద్ జిల్లాలో 19 మండలాల్లో 393 గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు జరిగాయి. అటుఇటుగా చూస్తే తండాలలో సుమారుగా ఒక్కొక్క సర్పంచ్ అభ్యర్థి రూ.5లక్షల నుంచి రూ.10 లక్షలు, చిన్న గ్రామ పంచాయతీల్లో రూ.1015 లక్షలు, కమర్షియల్‌గా పిలవబడే మేజర్ పంచాయతీల్లో రూ.50 లక్షలకు పైగానే ఒక్కో సర్పంచ్ అభ్యర్థి ఖర్చు చేసినట్టుగా రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇలా చూస్తే ఎంత లేదన్న ఉమ్మడి జిల్లాలో సర్పంచ్ అభ్యర్థుల ఖర్చు రూ.50 కోట్లకు పైమాటే అన్న టాక్ వినిపిస్తోంది. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం మేజర్ పంచాయతీల్లో సర్పంచ్ అభ్యర్థి ఖర్చు రూ.2.5 లక్షలు, చిన్న పంచాయతీల్లో రూ. లక్షన్నరగా నిర్ణయించింది.

### ఇబ్బడిముబ్బడిగా హామీలు..

గ్రామాల్లో ఎన్నికల బరిలో నిలబడిన అభ్యర్థులు గ్రామ మేనిఫెస్టో తయారు చేసి ఇబ్బడిముబ్బడిగా హామీలు ఇచ్చేశారు. గెలిస్తే ఫలానా పనులు చేసి పెడతామని రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా దాదాపు అన్ని పార్టీల మద్దతుదారులు ప్రజలకు హామీలు గుప్పించారు. అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా పంచాయతీలకు నిధులు రావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిధులు వస్తే అంతో ఇంతో వెనకేసుకునే అవకాశాలు ఉన్నాయని.. రాకపోతే పరిస్థితి ఏమిటనే చర్చ సాగుతోంది. కొంతమంది అభ్యర్థులు ఆస్తులు ఉండి అమ్ముకుని ఎలాగైనా గ్రామ సర్పంచ్ పీఠం కైవసం చేసుకోవాలని ఉవ్విళ్లూరారు. ఒక మరికొందరు ఐదేళ్లలో పేరు ప్రఖ్యాతులతో పాటు కాస్తోకూస్తో సంపాదించుకోవచ్చని సర్పంచ్‌గిరి బరిలో దిగారు.

### ఓడిన వాళ్లు..

ఉమ్మడి జిల్లాలో ఒక్కో గ్రామ పంచాయతీకి దాదాపు ముగ్గురు నుంచి నలుగురి మధ్య పోటాపోటీ సాగింది. ఈ నలుగురు అభ్యర్థులు ఎక్కడ కూడా ఖర్చుకు వెనకాడలేదు. ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉన్నా.. అభ్యర్థులు తెలిసిన వాళ్ల దగ్గర అప్పు చేసి, ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టారు. పొలం, ఇతర స్థలాలు అమ్మకానికి పెట్టి డబ్బు సమకూర్చుకుని మరీ పోటీలోకి దిగారు. తీరా ఓటమి పాలైన వాళ్లు అప్పులెలా తీర్చాలో తెలియక ఇప్పుడు తలలు పట్టుకుంటున్నారు.

### అభ్యర్థుల ఖర్చు వెల్లడిపై అనుమానాలు

ఎన్నికల ఖర్చుపై ఈసీ నిబంధనలు పెట్టింది. అయినా కూడా ఎక్కడా ఈ నిబంధన అమలు కాలేదని పలువురు పేర్కొంటున్నారు. అయితే ఎన్నికలు ముగిశాక పోటీ చేసిన అభ్యర్థులు తమ ఖర్చుల వివరాలను ఎన్నికల కమిషన్‌కు నివేదించాల్సి ఉంటుంది. గతంలో పోటీ చేసిన అభ్యర్థులు ఇప్పటివరకు ఖర్చుల వివరాలు వెల్లడించలేదని తెలుస్తోంది. ఒకవేళ ప్రస్తుత అభ్యర్థులు తమ ఖర్చుల వివరాలను వెల్లడిస్తే చేసిన రూ.లక్షల ఖర్చును కమిషన్‌కు వివరించే అవకాశం లేదని సమాచారం. ఉమ్మడి జిల్లాలో ఈనెల 17న మూడోవిడత ఎన్నికలు జరగనున్నాయి. ఈ ప్రాంతాల్లో పోటీచేసే అభ్యర్థుల ఖర్చు మరో రూ.10 కోట్ల వరకు పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది.



## కాంగ్రెస్ మద్దతుదారులను గెలిపించండి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారులను గెలిపించాలని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు కోరారు. మద్నూర్‌లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా మండల కేంద్రంలో అన్నాబావు సాఠే విగ్రహానికి, గాంధీ చౌక్ వద్ద మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పదిహేనేళ్లుగా ఈ ప్రాంతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన హన్మంత్ షిండే జుక్కల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేదన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచాక మద్నూర్‌లో సీసీ రోడ్ల కోసం రూ.1.20కోట్లు మంజూరు చేశానన్నారు. రెండేళ్లలో మద్నూర్ మండల కేంద్రానికి 112 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించానని వెల్లడించారు. కాంగ్రెస్ మద్దతుదారులను గెలిపిస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఆయన పేర్కొన్నారు.

## సోమార్‌పేట్‌లో ఓడిన అభ్యర్థి ఇంటిపై దాడి..

**మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, బీఆర్ఎస్ నేతల ఆందోళన**

**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** మండలంలోని సోమార్‌పేట్‌లో ఉద్రిక్తత చోటు చేసుకుంది. సర్పంచ్ ఎన్నికలు ముగిసిన మరుసటి రోజే ఓడిన అభ్యర్థి ఇంటిపై దాడి జరిగింది. సర్పంచ్ ఎన్నికల్లో బాలరాజు జరగగా ఓ పార్టీ మద్దతుదారుడు ఓడిపోయాడు. అయితే తాము గెలిచినప్పటికీ ఇబ్బందులు పెట్టాడనే కక్షతో ప్రత్యర్థి వర్గం దాడికి దిగిందని గ్రామస్థులు పేర్కొన్నారు. ట్రాక్టర్‌తో ఆయన ఇంటిపైకి దాడికి వెళ్లగా బాలరాజు తప్పించుకున్నాడని తెలిపారు. ఈ క్రమంలో గంజి భారతి, తోట శారద, బాలమణి, సత్యవ్వకు గాయాలయ్యాయి. వీరిలో గంజి భారతి, తోట శారద పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. బాలమణి, సత్యవ్వలను ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అనంతరం బాధిత వర్గానికి మద్దతు తెలుపుతూ పలువురు బీఆర్ఎస్ నాయకులు నిజాంసాగర్ రోడ్డుపై రాస్తారోకో చేశారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆందోళనకు దిగారు. ప్రత్యర్థులపై దాడి చేస్తూ భయభ్రాంతులకు గురిచేసిన కాంగ్రెస్ నాయకులపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు కక్షపూరితంగా గుండాయిదాన్ని ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకూ తాము ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. సోమార్‌పేట్ సర్పంచ్‌గా గెలుపొందిన అభ్యర్థిని సైతం పదవి నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. సుమారు నాలుగున్నర గంటల పాటు రాస్తారోకో నిర్వహించారు. దీంతో భారీగా ట్రాఫిక్ జాం అయ్యింది. ఈ విషయమై డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ రాజారెడ్డి, ఎస్సై మహేష్ బాధితులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా వారు భీష్మించుకుని కూర్చున్నారు. దీంతో డీఎస్పీ మాజీ ఎమ్మెల్యే సురేందర్‌కు ఎస్పీతో మాట్లాడించారు. హత్యాయత్నం కేసు నమోదు చేసి ఘటనకు పాల్పడిన వారిని రిమాండ్ చేయాలని ఎస్పీని మాజీ ఎమ్మెల్యే కోరారు. ఎస్పీతో మాట్లాడిన అనంతరం బాధితులు ఆందోళన విరమించారు.



### సోమార్‌పేట్‌లో ఘటనపై కేటీఆర్ ఆరా..

పంచాయతీ ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థి ఇంటిపై దాడి జరిగిన ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరా తీశారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ రాజేష్ చంద్రకు స్వయంగా ఫోన్ చేశారు. బాధితులకు రక్షణగా నిలవాలని.. బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు. దాడికి పాల్పడిన వారిపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జాజాల సురేందర్‌తో కేటీఆర్ ఫోన్‌లో మాట్లాడారు. ఘటనకు సంబంధించిన పూర్తివివరాలు తెలుసుకుని బాధితులకు అండగా ఉండాలని సూచించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.



## నిరుద్యోగ యువతకు ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తాం: సుదర్శన్ రెడ్డి

**అక్షరటుడే నిజామాబాద్ సిటీ :** నిరుద్యోగ యువతలో నైపుణ్యాన్ని మెరుగుపర్చే విధంగా వారికి ప్రత్యేక శిక్షణనిస్తామని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద ఉన్న ఐటీ హబ్‌ను సందర్శించారు. పలు ఐటీ కంపెనీల ప్రతినిధులతో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికంగా ఉన్న నిరుద్యోగ యువతకు ఐటీ హబ్‌లో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. బీటెక్ పూర్తి చేసుకున్న వారికోసం ఐటీ హబ్‌లో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. శిక్షణ కోసం పెద్ద నగరాలకు వెళ్లి అనవసరంగా ఖర్చులు పెంచుకోవద్దని ఆయన యువతకు సూచించారు. చాలీచాలని జీతాలతో యువత ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్నారని.. ఇకనుంచి నైపుణ్యత కలిగిన యువతకు ఇక్కడే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఉచిత శిక్షణ ద్వారా ఐటీ ఉద్యోగాలు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఐటీరంగానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, వ్యవసాయ కార్పొరేషన్ సభ్యులు గడుగు గంగాధర్, నుడా చైర్మన్ కేశ వేణు, కాంగ్రెస్ నాయకులు ధర్మపురి సంజయ్, కాకతీయ విద్యా సంస్థల డైరెక్టర్, డిస్ట్రిక్ట్ సెక్యూరిటీ కౌన్సిల్ మెంబర్ రజనీకాంత్, ఇతర ఐటీ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలి



**అక్షరటుడే, ఆర్మూర్:** గ్రామాలు త్వరితగతిన అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్ ఛార్జి వినయ్‌కుమార్ రెడ్డి కోరారు. ఈ మేరకు నియోజకవర్గంలోని ఆలూర్ మండలంలో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఆలూరు మండలం దేగాం, డోంకేశ్వర్, మంథని, మచ్చర్ల గ్రామాల్లో కాంగ్రెస్ బలపర్చిన సర్పంచ్, వార్డు అభ్యర్థులకు మద్దతుగా ఆయన ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో దేగం శ్రీనివాస్ గౌడ్, చుక్కల గంగాధర్, పెంటల ప్రభాకర్, బాంపల్లి చిన్న గంగాధర్, స్రవంతి సుమన్, గ్రామ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## వేంకటేశ్వర ఆలయ అభివృద్ధికి కృషి

**అక్షరటుడే, భిక్కనూరు:** మండల కేంద్రంలోని అతి పురాతనమైన శ్రీ వేంకటేశ్వర ఆలయం అభివృద్ధికి కృషి చేస్తానని భిక్కనూరు సర్పంచ్‌గా ఎన్నికైన బల్యాల రేఖ సుదర్శన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆమె ఆలయాన్ని సందర్శించి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వ సహకారం తీసుకుంటామని తెలిపారు. సర్పంచ్‌గా ఎన్నికైన రేఖను ఆలయ ఛైర్మన్ పబ్బ నాగరాజు ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పబ్బ నాగార్జున, కుర్రి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు అమూల్య



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ మండలం మగ్గిడి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థిని అమూల్య (జీజీ కాలేజీ) జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ మధుసూదన్ ఓ ప్రకటనలో తెలిపారు. రాజస్థాన్ రాష్ట్రంలో ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకు జరుగుతున్న జూనియర్ జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొననుందని పేర్కొన్నారు. అమూల్య నవంబర్ 29 నుంచి డిసెంబర్ 2 వరకు సిరిసిల్లలో జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి జాతీయ స్థాయికి పోటీలకు ఎంపికైంది. జాతీయస్థాయి పోటీలకు అమూల్య ఎంపిక కావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్, తెలంగాణ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి హనుమంత్ రెడ్డి, జిల్లా వాలీబాల్ ప్రధాన కార్యదర్శి మల్లేష్ గౌడ్, ట్రెజరర్ గంగారెడ్డి, జిల్లా యువజన, క్రీడల అధికారి పవన్ మగ్గిడి, పాఠశాల హెచ్‌ఎం తిరునగరి హరిత, వీడీసీ సభ్యులు అభినందించారు.

## గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి



**అక్షర టుడే, ఎల్లారెడ్డి:** సర్పంచ్‌లు ప్రజల మధ్యే ఉంటూ గ్రామాలను అభివృద్ధి బాట పట్టించాలని ఎమ్మెల్యే మదన్ మోహన్ సూచించారు. నాగిరెడ్డిపేట్ మండలం పోచారం నూతన సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు మెంబర్లు సోమవారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సంజీవ రావుకు, ఉపసర్పంచ్, వార్డు మెంబర్లకు ఎమ్మెల్యే మదన్ మోహన్ శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాసమస్యలను పరిష్కరిస్తూ ముందుడుగు వేయాలని సూచించారు. పోచారం గ్రామానికి ఎల్లప్పుడూ తన సహాయ సహకారాలు ఉంటాయని స్పష్టం చేశారు.

## కామారెడ్డిలో కారు బీభత్సం

**అక్షరటుడే, కామారెడ్డి:** పట్టణంలో ఓ కారు బీభత్సం సృష్టించింది. ఈ ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పట్టణంలోని భవానీ నగర్ కాలనీలో ఓ యువకుడు మద్యం మత్తులో కారు నడిపి హంగామా చేశాడు. కాలనీలో రోడ్డు పక్కన నిలిపిన బైక్‌లు, స్కూటీలపైకి కారు దూసుకెళ్లగా పలు వాహనాలు పాక్షికంగా ధ్వంసమైనట్లుగా తెలుస్తోంది. అయితే ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని కారు నడిపిన యువకుడిని అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం.

ఆర్మూర్ మున్సిపాలిటీ సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతోంది. పట్టణంలో పారిశుధ్య సమస్య ప్రజలను వేధిస్తోంది. మున్సిపస్ స్థలాల కబ్జా యథేచ్ఛగా సాగుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. అలాగే మున్సిపల్ కార్యాలయంలోనూ ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. కొత్త కమిషనర్ రావడంతో గాడిన పడుతుందన ప్రజలు భావిస్తున్నారు. –అక్షరటుడే, ఆర్మూర్




# ఆర్మూర్ మున్సిపల్ గాడిన పడేనా..?

■ కొత్త కమిషనర్‌కు సమస్యల స్వాగతం ■ అవినీతి కూపంలో బల్దియా ■ ఇష్టారాజ్యంగా ఉద్యోగుల రాకపోకలు ■ ప్రజాసమస్యలు పట్టింపు కరువు

పట్టణంలో 36 వార్డులు, 100కు పైగా కాలనీలు ఉన్నాయి. లక్షకు పైగా జనాభా ఉంది. ఆర్మూర్ పట్టణంలో ముఖ్యంగా చెత్తను తరలించే వాహనాలు ఆయా కాలనీల్లోకి సక్రమంగా రాకపోవడంతో ప్రతి నిత్యం ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో తమ కాలనీకి చెత్త వాహనం రావడం లేదంటూ ఓ కౌన్సిలర్ ఏకంగా చెత్త ఆటో అద్దాలు పగులగొట్టిన సంఘటనలు ఉన్నాయి.

### ప్రతి పనికి ఓ రేటు..

ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయం అవినీతికి అడ్డాగా మారింది. కార్యాలయంలోని అధికారులు, సిబ్బంది చేతులు తడపందే ఫైళ్లు ముందుకు సాగడం లేదన్న ఆరోపణలున్నాయి. ప్రతిపనికి ఓ రేటును ఫిక్స్ చేసుకొని ప్రతిరోజు కార్యాలయం సమయం ముగిసిన తర్వాత సెటిల్‌మెంట్లు చేసుకుని అధికారులు, సిబ్బంది ఇళ్లకు వెళ్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్, శానిటరీ, జనన మరణ శాఖల్లో అవినీతి తారాస్థాయికి చేరిందని తెలుస్తోంది.

### ఇష్టానుసారంగా నంబర్ల కేటాయింపు..

ఆర్మూర్ మున్సిపాలిటీలో ప్రధానంగా అక్రమంగా ఇంటి అనుమతులు, ఇంటి నెంబర్ల కేటాయింపులు భారీఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నాయి. పట్టణంలోని పలు కాలనీల్లోరి ప్రభుత్వ ప్రైవేటు భూముల్లో చిన్నపాటి రేకుల ఇళ్లు వేసుకున్న వారికి అక్రమంగా ఇంటి నంబర్లు కేటాయించినట్లు ఆరోపణలున్నాయి. గతంలో దీనిపై విచారణ చేపట్టగా పలు ఇంటి నంబర్లను రద్దు చేశారు. ఇంకా వందల సంఖ్యలో అక్రమంగా ఇంటినంబర్లు ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి.

### ఏసీబీకి చిక్కిన కమిషనర్..

ఓ ఇంటి అనుమతి విషయంలో రూ.20వేల లంచం తీసుకుంటూ ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ రాజు ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ విషయం తెలిసిందే. ఇంటి నంబర్ల విషయంలో భారీఎత్తున అవినీతి జరిగిందని ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు పట్టణానికి రూ.18 కోట్ల నిధులు మంజూరు కాగా తమకిష్టమైన వారికి టెండర్లు అప్పగించిన విషయంలో కొంత మొత్తంలో నగదు చేతులు మారినట్లు సమాచారం. కమిషనర్ ఏసీబీకి పట్టుబడ్డ సమయంలో కార్యాలయంలోని పలువురు అధికారులను, అవుట్ సోర్సింగ్ సిబ్బందిని సైతం ఏసీబీ అధికారులు అర్ధరాత్రి రెండు గంటల వరకు విచారించారు.

### నూతన కమిషనర్‌కు పెనుసవాళ్లు..

సమస్యలు, అవినీతి ఆరోపణలతో కొట్టుమిట్టాడుతున్న ఆర్మూర్ మున్సిపాలిటీలో నూతన కమిషనర్‌గా శ్రావణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పారిశుధ్యం, మురికి కాల్వలు, రోడ్స్, అక్రమ ఇంటి నంబర్ల కేటాయింపు, ప్రభుత్వ ప్రైవేటు స్థలాల్లో అక్రమ కట్టడాలు, అవినీతితో కూడుకుపోయిన మున్సిపల్ కార్యాలయం ఇలా ఎన్నో సవాళ్లు ఆమె ముందు ఉన్నాయి. మరోవైపు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, అధికార పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఇలా మూడు పార్టీల నేతలతో ఆర్మూర్ రాజకీయ ప్రస్తుతం రసకందాయంగా సాగుతోంది. ఈ క్రమంలో నూతనంగా బాధ్యతలు తీసుకున్న కమిషనర్ శ్రావణి ఈ సమస్యలన్నీ ఏ విధంగా అధిగమించి మున్సిపల్ కార్యాలయాన్ని గాడిన పెడతారా అనేది వేచి చూడాల్సిందే.

## పెన్షనర్లను నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం



**అక్షరటుడే, ఇందూరు:** రాష్ట్ర అభివృద్ధికి సేవలందించిన పెన్షనర్ల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో క్రీడాపోటీలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పెన్షనర్లకు కొన్నేళ్లుగా సమస్యలు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వాటిని పరిష్కరించడంలో విఫలమైందన్నారు. ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆరోగ్యం, ఐక్యత, సామాజిక స్ఫూర్తిని పెంపొందించేలా క్రీడా పోటీలు నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం ప్రతినిధులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## అంబారిపేట శివారులో పెద్దపులి సంచారం..





**అక్షరటుడే, కామారెడ్డి :** కామారెడ్డి జిల్లాలో పెద్దపులి సంచారం రైతులు, ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. దోమకొండ మండలంలోని అంబారిపేట శివారులో పెద్దపులి దూడలపై దాడి చేసినట్లు అక్కడి రైతులు పేర్కొంటున్నారు. అంబారిపేట గ్రామానికి చెందిన స్వామి గౌడ్ అనే రైతుకు చెందిన దూడలపై పెద్దపులి దాడి చేసినట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. దూడలపై దాడి జరిగిన ప్రాంతాన్ని అధికారులు పరిశీలించారు. పెద్దపులి సంచరించిన ప్రాంతంలో ఫారెస్ట్ అధికారులు ట్రాక్ కెమెరాలను ఏర్పాటు చేశారు. కాగా.. ట్రాక్ కెమెరాలో పెద్దపులి కదలికలు స్పష్టంగా రికార్డు అయ్యాయని తెలుస్తోంది. దీంతో అంబర్ పేట శివారులో పెద్దపులి సంచరిస్తున్నట్లు అధికారులు ధ్రువీకరించారు. పెద్దపులి సంచారంతో పశువుల కాపరులు, వ్యవసాయ పనులు చేసుకునే వారు పొలాల వైపు వెళ్లడానికి జంకుతున్నారు. రాత్రివేళల్లో ఒంటరిగా బయటకు రావద్దని ఫారెస్ట్ అధికారులు సూచించారు. గత జులై నెలలో రెడ్డిపేట తండా శివారులో పెద్దపులి సంచారం కలకలం రేపింది. పెద్దపులిపై విషప్రయోగం చేశారన్న ఆరోపణలపై ముగ్గురిని అరెస్ట్ చేసి జైలుకు సైతం తరలించారు. ఉమ్మడి జిల్లా అటవీశాఖ అధికారులు ఆపరేషన్ టైగర్ పేరిట పెద్దపులి కోసం జల్లెడ పట్టినా దాని జాడ కనిపించలేదు. అయితే పెద్దపులి క్షేమంగా వేరే ప్రాంతానికి చేరి ఉంటుందని తెలియడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. మళ్లీ ఐదు నెలల తర్వాత పెద్దపులి సంచారం కలకలం రేపుతోంది.

## నూతనంగా ఎన్నికైన సర్పంచులకు సన్మానం



**అక్షరటుడే, బోధన్ :** బోధన్ నియోజకవర్గంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లను బీజేపీ బోధన్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మేడపాటి ప్రకాశ్‌రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో బోధన్ నియోజకవర్గంలో బీజేపీ మద్దతుదారులు ఒక్కరు కూడా సర్పంచ్‌గా లేరన్నారు. కాగా.. ప్రస్తుతం బీజేపీ మద్దతుదారులు 16 సర్పంచ్ స్థానాల్లో గెలుపొందడం గర్వకారణమన్నారు. రాబోయే రోజుల్లో బీజేపీకి బోధన్ అడ్డాగా మారాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో బోధన్ సాలూర మండల అధ్యక్షుడు శిల్ప సుదర్శన్, గంగాధర్ పాల్గొన్నారు.

## ఆర్మూర్‌లో గోదావరి నది పరిక్రమణ



**అక్షరటుడే, ఆర్మూర్:** గోదావరి పరిక్రమణలో (ప్రదక్షిణ) భాగంగా సాధువులు, మహాత్ములు, పీఠాధిపతులు సోమవారం ఆర్మూర్‌కు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి పెర్కిట్ వద్ద వారికి స్వాగతం పలికారు. నవనాథ సిద్దుల గుట్ట ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు దారి పొడవున పూలు చల్లుతూ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ప్రవాస భారతీయుల సంక్షేమ వేదిక అధ్యక్షుడు కోటపాటి నరసింహనాయుడు, పోల్కంవేణు, సుంకర రంగన్న, సిద్దులగుట్ట ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## అంగరంగ వైభవంగా మల్లికార్జున స్వామి కల్యాణం

**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని దేవునిపల్లిలో శ్రీ మల్లికార్జున స్వామి ఆలయ ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. సోమవారం ఉదయం ఆలయం వద్ద అగ్నిగుండం ఏర్పాటు చేశారు. భక్తులు అధికసంఖ్యలో గుండంలో నడిచి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారికి అఖండ దీపారాధన, గణపతి గౌరీ పూజ, స్వస్తి పుణ్యహవచనం నిర్వహించారు. అలాగే మేడాలమ్మ గొల్ల కేతమ్మశ్రీ మల్లికార్జున స్వామి కల్యాణాన్ని సంప్రదాయ బద్ధంగా జరిపించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉత్సవాలలో భాగంగా మంగళవారం బోనాల ఊరేగింపు నిర్వహించనున్నారు. అనంతరం భక్తులు స్వామివారికి ఒడిబియ్యం సమర్పించనున్నారు. సాయంత్రం ఎడ్ల బండ్ల ఊరేగింపు కార్యక్రమం ఉంటుంది.

## బాధితుడికి డబ్బులు తిరిగి ఇప్పించిన కోటపాటి



**అక్షరటుడే, ఆర్మూర్ :** ట్రావెల్ ఏజెంట్ చేతిలో మోసపోయిన యువకుడికి ప్రవాస భారతీయుల సంక్షేమ వేదిక అధ్యక్షుడు కోటపాటి నరసింహనాయుడు అండగా నిలిచారు. రూ.2 లక్షల నగదు రికవరీ చేయించి బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఆర్మూర్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మెండోరా మండలం వెల్కటూర్‌కు చెందిన వెంకటేష్ ఉపాధి కోసం విదేశాలకు వెళ్లాలనే ఆలోచనతో నందిపేట్ మండలంలోని ఒక సబ్ ఏజెంట్‌ను సంప్రదించాడు. అతను రూ.3 లక్షలు తీసుకొని విజిట్ వీసాపై రష్యాకు పంపాడు. అక్కడ సరైన ఉద్యోగం లేక అక్కడే ఉండి ఇతర పనులు చేసుకోవడానికి ధ్రువీకరణ పత్రాలు కూడా ఇప్పించకపోవడంతో అర్ధాంతరంగా 15 రోజులకే ఇంటికి తిరిగి వచ్చాడు. దిక్కుతోచని స్థితిలో ఆర్మూర్‌లోని 'ప్రవాస భారతీయులు సంక్షేమ వేదిక' అధ్యక్షుడు కోటపాటి నరసింహనాయుడును సంప్రదించాడు. తనకు జరిగిన అన్యాయాన్ని వివరించి సాయం కోరడంతో ఆయన స్పందించారు. పూర్తి వివరాలు తెలుసుకున్న కోటపాటి సదరు ఏజెంట్‌ను పిలిపించి బాధితుడు వెంకటేష్‌కు నష్టపరిహారం ఇవ్వాల్సిందిగా చెప్పారు. నష్టపరిహారం చెల్లించకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని పేర్కొనడంతో.. సదరు ఏజెంట్ రూ.2 లక్షలు బాధితుడికి అప్పజెప్పాడు. దీంతో కోటపాటికి బాధితుడు వెంకటేష్ కృతజ్ఞతలు తెలియజేశాడు.